# గ్రహణం

పోలీసు వాహనం రాజమండ్రి జైలు ముందు నుండి కదిలింది. అంతకు ముందె హైదరాబాద్ వరకున్న అన్ని పోలీస్ స్టేషన్లకు వైర్‌లెస్ మెసెజ్ వెళ్ళింది.

తన రచనల ద్వారా ప్రజలకు ప్రశ్నించమని నేర్పుతూ ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్ర పన్నుతున్నాడన్న నేరం మోపి, విచారణ నిమిత్తం హైకోర్టుకు తీసుకు వెళుతున్న ప్రజాకవి 'రాజం'ను మార్గమధ్యంలో పోలీసుల నుండి తప్పించుక తీసుకెళతామని అజ్ఞాత వ్యక్తుల ఫోను.

వ్యాన్ విజయవాడ దాటి, కోదాడ దాటి సూర్యాపేట చేరుకుంది. జాతీయ రహదారి లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర గుంపులు గుంపులుగ జనం.

పోలీసులు తుపాకులు సర్దుకున్నారు. పోలీసు ఆఫీసర్ కాస్త అసౌకర్యంగా కదిలి, మెసేజ్ గుర్తుకు రాగా....

"సార్ వీళ్ళంతా మీ ఫాలోయర్స్ కారు కదా?" రివాల్వర్‌ను ఓసారి తడుముకుంటూ అన్నాడు.

అప్పటి వరకు చదువుతున్న పుస్తకం పేజీల్లో నుండి చూపులు పోలీస్ ఆఫీసర్ వైపు మరల్చి, ఓ చిరునవ్వు నవ్వి జనం వైపు చూశాడు.

"డ్రైవర్ వ్యాన్ వెనక్కు మలుపుకొని పాత రోడ్డు గుండా పోనీ" అన్నాడు పోలీసాఫీసర్.

వ్యాన్ పట్టణ మద్య నుండి పొట్టి శ్రీరాములు బొమ్మ దగ్గరకొచ్చేసరికి మళ్ళీ జనం. ఈసారి గుంపులుగ కాదు ఒక వరుసలో నినాదాలిస్తూ నడుస్తున్నారు. ఆడవాళ్ళు చేతుల్లో కాలి నీళ్ళ కుండలు.

పోలీసు ఆఫీసర్ వైర్‌లెస్ ఆన్ చేసి....

"హల్లో, హల్లో పోలీస్‌స్టేషన్"

"హల్లో, హల్లో యస్" స్టేషన్ ఇన్‌ఛార్జి.

"హాల్లో ఈ జనం ఓవర్ -"

"హల్లో, హల్లో వాళ్ళు నీళ్ళ కోసం ధర్నా చేయడానికి మండలాఫీసుకు వెళుతున్నారు. ఫిరు ఫార్వార్డ్ కావచ్చు."

ఆ నాలుగు మాటలని వైర్‌లెస్ ఆఫ్ అయింది.

వ్యాన్ వేగం పెరిగింది. నార్కట్‌పల్లి, చిట్యాల్ దాటి గుడ్రాంపల్లి చేరింది.

రాజంరోడ్డుకు ఇరుప్రక్కల చూస్తు ఊరు ఏమంతగ మారలేదు అవె పెంకుటిండ్లు, ఒకటి రెండు కొత్తడాంబరు. అదనంగా కట్టెకోతమిషన్. పోలీసు ఆఫీసర్ వైపు మళ్ళి-

"సార్ ముందు పంతంగి ఊరొస్తుంది. అక్కడ ఓ నిముషం ఆపండి. అది మావూరు" అన్నాడు రాజం.

పోలీసాఫీసర్‌కు ఆపాలని లేకున్నా ప్రముఖ కవి అని గుర్తు రాగానే "మీకు ఓ ఊరేంటి సార్, మీరేవూళ్ళో వుంటే అదే మీ ఊరు" అన్నాడు.

ఈసారి మెల్లగ శబ్దం లేని నవ్వు నవ్వాడు రాజం.

"వీలుంటే ఒక్క నిమిషం" అంటు పుస్తకాన్ని మూసి పక్కకు పెట్టాడు.

"తప్పకుండా సార్" అంటూ డ్రైవర్‌కు పైగ చేశాడు. వ్యాన్ ఆగింది. అందరూ దిగారు.

ఒకప్పుడు రోడ్డుకు కిలోమీటర్ దూరంవున్న ఊరు యిపుడు రోడ్డు దగ్గరకి చేరింది. ఒత్తుగా వున్న తాడి చెట్లు పోయి, చిక్కగా కంప చెట్లు పెరిగాయి. బంగారుపూలతో అందంగా కనిపించే తంగేడు పొదలు మచ్చుకు లేవు! చుట్టు కలియ జూస్తూ బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకోసాగాడు. వ్యాన్ ఆగగానే అక్కడున్న జనం చుట్టూర గుమిగూడారు. ఎవరూ రాజంను గుర్తుపట్టలేదు. అందరు చూస్తూ నిలుచున్నారు. ఆయనకిపుడు యాబది ఏండ్లు, సగం నెరసిన గడ్డం, సన్నవి ఫ్రేం కళ్ళద్దాలు.

ఆ వూరి పిల్లలకు ఆయన అసలు తెలియదు.

యువతీ యువకులూ ఆయన్ను ఎన్నడు చూడలేదు. ఆయనా ఎవరిని గుర్తుపట్టలేకపోతున్నాడు.

తనబాల్యాన్ని బెదరగొట్టిందీ ఊరు!

తన కుటుంబాన్ని చెదరగొట్టిందీ ఊరు!!

"కవిగారు ఇకవెడదాం" పోలీసుఆఫీసర్.

రాజం కదిలాడు, అతని వెంట తుపాకులు నడిచాయి. ఆ తరువాత వాహనం కదిలింది. రాజం తలనిండా గతం తాలూకు ఆలోచనలు కదిలాయి.......

* * *

గుడి గుర్తొచ్చింది.

ఆ తరువాత ఆనాటి ఊరు గుర్తొచ్చింది.

ఆ రోజు దేవుని పెళ్ళి జరిగి సాయంత్రం ఊరేగింపు తరువాత ఉత్సవ విగ్రహాన్ని గుడికి చేర్చి తమ తమ ఇళ్ళకు వెళుతున్న అందరితోపాటు అంత వరకు డప్పులు కొట్టి పై నుండి వేసిన పైసలను అందుకుని యిళ్ళకు వెళుతున్న డప్పుల వాళ్ళల్లో మా అయ్య ఒకరు. అంత వరకు అయ్య వెంట నడిచి నేనొస్త పద అని, అక్కడే నిలుచొని చుట్టు చూస్తున్న నా తలలో రకరకాల ఆలోచనలు.

ఆ గుళ్ళో దేవుడు ఎలా వుంటాడో మా పెద్దలు ఎవ్వరు చెప్పలేదు. వాళ్ళూ ఎన్నడూ చూడలేదట. అంతే కాదు వాళ్ళు దేవుడు అని మాత్రమే అనాలి. రాముడు అని గూడ అనొద్దు. ఊరి బ్రాహ్మణులందరిని పేర్లు పెట్టి పిలవద్దు అయ్యగారు,

పంతులు అనాలి, చిన్న పిల్లలను కూడ చిన పంతులు అని పిలవాలి. ఒక రోజు నాతో పాటు చదువుకుంటున్న కరణం కొడుకును పేరు పెట్టి పిలిస్తే వాళ్ళ నాయనమ్మ విని -

"ఏందిరా మా అబ్బాయిని పేరుపెట్టి పిలుస్తావా? చినపంతులూ అనలేవూ?" అంటు గుడ్లురిమింది, ఇంకా గుర్తుంది.

"వస్తే నాలుగక్షరాలు రావచ్చు కానీ పుట్టిన కులం ఎక్కడకి పోద్దిర" అని అన్నది యింకా మరిచిపోలేదు. గుంజలకు కట్టివుంచిన ఆరిపోయిన దివిటీలను విప్పదీసి ఒక చోట వేస్తున్నారు. మంగలి యాదయ్య, చాకలి పెంటయ్య, మసక చీకటి. మెల్లగ నడిచి పందిరి దగ్గరకొచ్చి గుంజచాటుకు నిలుచున్నాను. అప్పుడు దేవుడు కాస్త దగ్గరయ్యాడు. అయినా కనిపంచడం లేదు. దర్వాజా దగ్గరికెళ్ళాలి. అప్పుడు కనిపించొచ్చు. మా తాత చూడలేదు. మా తండ్రి చూడలేదు అసలు వాళ్ళెవరూ ఆ బాట దాటి రానే లేదట. ఇక పందిట్లోకి వచ్చేదెక్కడిది. దేవున్ని చూడాలి! చూడాలి కానీ నన్ను ఎవరైనా చూస్తే. తలనిండా ఆలోచనలు, వంటినిండా భయం.

వున్నట్టుండి తలమీద ఏదో బలమైన హస్తం! అంతే. కాళ్ళల్లో వణుకు వచ్చి కళ్ళు బైర్లు కమ్మాయ. మెల్లగ చేత్తో అదిమి చూశాను. అది పూజారి చేయి కాదు. పందిరకి కట్టిన తోరణం నుండి జారిపడ్డ మామిడి కొమ్మ. వణుకు తగ్గి గుండెలో కాస్త ధైర్యం చేరింది.

దేవున్ని చూడాలన్న ఆ బలమైన కోరిక బెదురును తగ్గించింది. అడుగులో అడుగేస్తూ మెల్లగా వెళ్ళి దర్వాజ దగ్గర నిలుచున్నాను. ఎవరో వస్తున్నపాదాల అలికిడి. అంతే అలాగే బాజును పట్టుకుని గోడకు బల్లిలా ఆనుకొని నిలుచున్నాను. వస్తున్న వాళ్ళ పాదాల చప్పుడు మరీ దగ్గరౌతూవుంది. గుండె వేగం పెరగసాగింది. వళ్ళంతా నీళ్ళు నింపిన కొత్త కుండైంది.

దేవునికొచ్చిన కొత్త బట్టల మూటేమో పెంటయ్య భుజాన, కొబ్బరి పచ్చెలు, పండ్లు, ఫలాలున్న గంప వున్నట్టుంది యాదయ్య తల మీద సరిగా కనబడనీయని చీకటి కదా. ఒకరి వెనకొకరు బయటికి నడిచారు. నన్ను చూడనందుకు ముందు వాళ్ళకు ఓ దండం పెట్టి, ఇక లోపలికెళ్లొచ్చు అనుకుంటూ దర్వాజా వైపు మళ్ళాను. ఎదురుగా తుపాకీలాగ ఓ అంచుకర్ర, దానితోపాటు "ఎవర్రా" అన్న భయంకరమైన గొంతు. ముందు వేయటానికి ఎత్తిన పాదం తెలియకుండానే వెనక్కు వెళ్లింది. దేవున్ని చూడాలనుకున్న నా ఎదురుగ దయ్యంలాంటి ఆకారం, గొంతులో తడారింది. అక్కడి నుండి పరుగే పరుగు.

* * *

మరునాడు ఉదయం కరణంగారి వాకిట్లో అయ్య తల వంచుకుని నిలుచున్నాడు. అమ్మ ఏడుస్తూ కొంత దూరంగ

వేప చెట్టు చాటున నిలుచుంది. అయ్య పక్కన నేను, చుట్టూర మరో పది మంది యితర కులాల పెద్దలు.

కరణం చూపుల్లో నిప్పులు రాలుతున్నాయి. ఒక చేతిలో పంచె కొంగు, మరో చేతిలో అంచుకఱ్ఱ, కిర్రు చెప్పులతో అటు ఇటూ తిరుగుతున్నాడు. అవి మా అయ్య కుట్టినవే. వాటి అల్లికలు అమ్మ అల్లినవే. తాము చేసినవయినా అవి అప్పుడు మాత్రం తమ మీద పడేటట్టు కనిపించాయి! ఎందుకంటే రెండు మూడు సార్లు చెప్పును చేతుల్లోకి తీసుకోచూసిన కదలికలు. కరణం మరోసారి గుడ్లురిమి చూస్తూ - "ఎన్నడైనా ఇట్లా జరిగిందా" అయ్యవైపు చూశాడు.

"మీరెవరైనా యిట్ల జరిగిందని విన్నారా?" అంటూ అక్కడ నిలుచున్న పెద్దల వైపు చూశాడు.

"అపవిత్రం; అమంగళం! గ్రామానికి గండం!" నుదుట, ఎద భాగాన విభూతి. మెడలో రుద్రాక్ష మాల, నడుముకు ఉత్తరీయంతో ఆ గుడి పూజారి.

ఆయన మాటలు అక్కడ పల్లేరుకాయల్లా పరుచు కుంటున్నాయి.

"ఏదైనా శాంతి ఆలోచించండి" సాతాని పంతులు సలహా.

"ఏం శాంతి సేస్తారు? ఎంత ఖర్చు అవుతుంది? ఎవరు భరిస్తారు?" కరణం

"నిన్న దేవుని లగ్నం చేయడానికే ఎందరికో పంచె పట్టవల్సి వచ్చింది" ఆ పూజారి మాటలో కొంత అలసట కల్సివుంది.

మరి ఆయన బరువైన శరీరం వల్ల వచ్చిందో అంతకు ముందు జరిగిన వేడుకల పనిభారం వల్ల వచ్చిందో లేక మా మీదున్న విద్వేషం వల్ల వచ్చిందో!

"అయితే ఊర్కుందామంటార" కరణం.

"వూర్కుంటే ఊరికి అరిష్టమండి" పూజారి.

"చెప్పండి ఏం చేద్దాం?"

"ముందు అంటుపడ్డ గుడికి వెల్ల వేయాలి, మిగతా విషయాలు తరువాత" పూజారి.

"అయితే కానీయండి. ఆ ఖర్చును ఆని తండ్రి ఈరిగాని దగ్గర వసూలు చేయండి."

అప్పుడు అయ్య చేతులెత్తి నమస్కరిస్తూ అందరి వైపు చూశాడు. అక్కడున్న ఎవ్వరూ అయ్యవైపు చూడలేదు. అందరూ అంతే అన్నట్టు తలలు దించి నిలుచున్నారు.

అది గ్రహించిన అయ్య తలపాగను తీసి కిందుంచి మోకాళ్ళమీదవంగి చుట్టూ చూస్తూ, "గులాపొన్ని తమరే కాపాడాలి. వంటిమీద అంగి లేనొన్ని ఎక్కనించి తెచ్చేది." అన్నాడు.

అయ్య తలపాగాను అక్కడుంచలేదు, తన తలనో, నా తలనో తీసినేలమీద పెట్టినట్టనిపించింది.

"పూటకు లేనోళ్ళం మేమెక్కడ తెచ్చిస్తం దొరలారా, మా దయగల తండ్రులు కనికరించుండ్రి. ఆడు తెల్వక ముట్టుకుండు" అన్న మాటలు వినపడగానే వెనక్కు చూశాను.

చెట్టు చాటు నుండి జోడించిన చేతులు మాత్రమే కనిపించినాయి. అవి వూరికి చాకిరి చేసి నలుపెక్కిన చేతులు. వాటికి అరిగి రంగు వెలసిన మట్టి గాజులు.

"అప్పు సెయ్యి" అప్పటివరకు చేతిలో కదిలే కఱ్ఱను కదలకుండ పట్టుకుంటు అన్నాడు కరణం.

"అప్పెవరిస్తారు తండ్రీ" అంటు అయ్య లేచి నిలుచున్నాడు.

"నీకో బఱ్ఱె వున్నట్టుంది" పూజారి ఏదో గుప్తనిధిని గుర్తు చేసినట్టు అన్నాడు.

"దాన్ని అమ్ముకుంచు" వాకిట్లో వున్న గడ్డిపోచను కఱ్ఱతో పొడుస్తూ చూపులను దాని మీదే వుంచి అన్నాడు.

"ఆకలైనా, దూపైనా, దాని, పాలె. సారెడు సల్లతాగి పొద్దుగడుపుతం. పిల్లగానికి యిన్ని పాల సుక్కలు. దాన్నమ్మితే బతకలేం" అంది అమ్మ చెట్టుచాటునుండే.

కరణానికి ఏదో తట్టినట్టు రెండడుగులు ముందుకేసి అందర్నీ దగ్గర్కి రమ్మని సైగచేసి గుసగుసలాడి

"ఈరిగ అల్కటి మార్గం సెవుతం. ఈ పని అయితది".

ఓ కన్ను సగం మూసి తెరుస్తూ తలనాడించాడు.

"దొర. అయ్యేదైతే అంతకన్నా కావల్సిందే ముంది"

"నువ్వింటవు మరి నీ కొడుకింటడ"

"తప్పు చేసింది ఆడే కదా యినిపిస్త సెప్పండ్రి" అంటు దోసిలి పట్టాడు.

"వాన్ని ఎవరి దగ్గరన్నా జీతం కుదిర్చి అప్పు తీసుకర!"

"అమ్మో నేను చదువుకొనాలె" అంటు వెళ్ళి అమ్మ ఒడిలో ముఖం దాచుకున్నాను.

"ఈరిగ కర్ణపాయన అన్నట్టు కొడుకును జీతం వుంచర" పూజారి.

"నేను జీతం వుండ. చదువుకుంట" ఈసారి పెద్దగ అరిచాను.

"అదిష్టం లేకపోతే ఆ బర్రెనమ్మర. ఊరకే ఆలోచిం చేదేంది?"

అక్కడున్న పెద్దలలో నుండి మరొకరి సలహా.

అయ్య ఏమనుకున్నడేమో, వంగి తలరుమాలు నందుకొని సంకలో పెట్టుకొని; యిప్పుడే వొస్త అని సెప్పి మమ్ములను యిక్కడ వుండమని సైగచేసి యింటి వైపు నడిచాడు. అమ్మా నేనూ వేపచెట్టు మొదటనే నిలుచున్నాం. కొంచెం ఎండెక్కింది. అక్కడ వున్న వాళ్ళ మధ్యన గుసగుసలు.

కొంతసేపయ్యాక వాళ్లు కోరినట్టుగానే బర్రెను, దూడను కొట్టుకొచ్చి అక్కడున్న వేపచెట్టుకు కట్టేశాడు. అమ్మ కళ్ళ నుండి కన్నీటి ధారలు. ఏదో అనబోయిన అమ్మవైపు గుడ్లురిమి చూసి, నోరెత్తద్దు అని కళ్ళతోనే సైగ చేసాడు. అమ్మ తల వంచుకుని దుఃఖాన్ని మింగుతువుంది.

అయ్య చేతులు జోడించి అందరి వైపు చూస్తూ "ఈ బర్రె మీదేలే అన్నాడు" అంతేకాదు.

"పూటకు లేకున్నా మాట పడను" అనికూడ అన్నాడు
. ఎవరు చప్పుడు చేయలేదు.

అమ్మ ఎదలోని బాధను నెమరేసుకుంటోంది.

"దీని పాలు తాగి బతుకుతున్నం". తన్నుకొస్తున్న దు:ఖాన్ని ఆపుకుని అమ్మను వొదిలించుకుని అందరి ముందుకు వెళ్ళి -

"యిక దేవున్ని కడుగుతరో, మనిషి ముట్టుకుంటె మైలపడ్డ గుడినే కడుగుతరో మీ యిష్టం" ముక్కుపుటలు కదులుతువుండగా చుట్టూ చూస్తూ అన్నాను.

"ఏంరో' చిన్న పెద్ద లేకుండ ఉపన్యాసం ఇస్తున్నవు" పూజారి.

"ఉన్నది వున్నట్టంటే ఊరు అచ్చిరాదు అని అప్పుడప్పుడు అంటూ ఉంటారు కదా. "యిప్పుడూ అంటున్నాం" అందుకే మేమే ఈ ఊరొదిలి పోతం. రావే" అంటు అయ్య చెయ్యి పట్టుకుని చెట్టు దగ్గర్కి వచ్చి, ఓసారి బర్రెను, దూడను చేతితో తాకి అమ్మ చేయిని పట్టుకుని అక్కడి నుండి కదిలాము. ఆ వూరును వదిలాము.

ఊరంటే ఇల్లు - వాకిళ్ళే కాదు! ఊరంటే మనుషులుకాదా?

* * *

అపుడు అమ్మ నా నోరు మూయగలిగింది! ఇపుడు ప్రభుత్వం జైల్లో పెట్టగలిగింది! అయినా నా ఆలోచనలను

ఆపగలరా? నా పెన్నును మూయగలరా?

వ్యాన్ హైకోర్టు ఆవరణలో ఆగింది.

మెట్ల మీద నల్ల కోట్లవాళ్ళ కోలాహలం!

పైన కోర్టు భవనపు గోపురాల అంచులకు తల కిందులుగా వేలాడుతున్న గబ్బిలాలు!?

ఆంధ్రజ్యోతి
**మే, 1995**